



హైదరాబాద్ భక్తుల ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు

మూట, ముల్లెతో మల్లన్న చెంతకు

నేడే పట్నంవారం..

మూట, ముల్లెలతో బైలెల్లి కొమురవెల్లి క్షేత్రానికి శనివారం సాయంత్రం చేరుకున్నారు నగరవాసులు.. కాళ్లు, చేతులు కడుక్కోకుండా నేరుగా మల్లన్నస్వామిని ధూళిదర్శనం చేసుకున్నారు. ఎటుచూసిన ఆలయపరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. నేటి నుంచి సత్తేటివారాల మహా జాతర ప్రారంభంకానున్నది. పట్నంవారం ఉత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ కారణంగా ప్రైవేటు గదుల అద్దెలు మండిపోతున్నాయి.

- ప్రారంభం కానున్న జానపదుల మహాజాతర
- భక్తజనంతో ఆలయపరిసరాల కిటకిట
- వసతిగదులు దొరక్క భక్తుల ఇబ్బందులు
- కానరాని ఉచిత వాహన సౌకర్యం
- ప్రైవేటు గదుల అద్దె దోపిడీ
- 510 మందితో పోలీసుల పటిష్ట బందోబస్తు

7



మల్లన్నకు ఒడిబియ్యం, బండారి తీసుకువెళుతున్న భక్తులు

కొలువుల కోట కొడకండ్ల

- ఆ గ్రామంలో 85 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు
- 1960లో ఐదుగురితో మొదలైన ప్రస్థానం
- గ్రామానికి ప్రత్యేక టీచర్ల సంఘం
- ఇతర రంగాల్లో మరో వంద మంది

7

Sunday Special

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్

కొండపాక, జనవరి 18, (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద శనివారం సాయంత్రం వాహనాలు బారులు తీరాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాలతో టోల్‌ప్లాజా కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. నగరానికి వెళ్తున్న వాహనాలు టోల్‌ప్లాజా వద్ద భారీగా బారులు తీరాయి.

సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చూస్తాం

- కలెక్టర్ మనుచౌదరి

తొగుట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూస్తామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం తొగుట మండలం ఘనపూర్ గ్రామంలో చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేచేస్తున్న సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామసభ తేదీలను ముందుగానే ప్రకటించి గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి మోహన్, ఎస్‌ఐ రవికాంత్‌రావు ఉన్నారు.

అధికార పార్టీ కాంగ్రెస్, స్థానిక ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కావడంతో కొన్నాళ్లుగా దుబ్బాక, జనగామ నియోజకవర్గాల పరిధిలో ప్రొటోకాల్ రభస తప్పడం లేదు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు అంటేనే అడుగడుగునా వివాదం రాజుకుంటుంది. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జికి ప్రాధాన్యమివ్వడంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. తాజాగా శనివారం దుబ్బాక నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటన, చేర్యాలలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదిపత్యపోరుకు మరింత ఆజ్యం పోసింది.



చేగుంటలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదికపై కూర్చోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మళ్లీ ప్రొటోకాల్ రభస

- కొన్నాళ్లుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆదిపత్య పోరు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, స్థానిక ఎమ్మెల్యేల మధ్య వివాదం
- మంత్రి దుబ్బాక నియోజకవర్గ పర్యటనలో రభస
- వేదికపై చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కూర్చోవడంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అభ్యంతరం
- చేర్యాలలోనూ కయ్యం
- వేర్వేరుగా రెండుసార్లు ప్రారంభం

దుబ్బాక/చేర్యాల, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక నియోజకవర్గంలో శనివారం జరిగిన రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పర్యటన మరోసారి ఆదిపత్యపోరుకు వేదికగా మారింది. అటు బీఆర్‌ఎస్ కార్యకర్తల నినాదాలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ప్రతినినాదాల మధ్య నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదికపై ముందు వరసలో కూర్చోగా ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాత్రమే ఉండాలని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే మంత్రి, అధికారులతో అన్నారు. దీనికి మంత్రి కొండా సురేఖ స్పందించి, వెనుక వరసలో కూర్చోవల్సిందిగా శ్రీనివాస్‌రెడ్డికి చెప్పారు. ఆయన కుర్చీలో నుంచి లేచి వెనక సీట్లో కూర్చోకుండా వేదికపై వెనక నిలబడ్డారు. అదే సభలో మంత్రి మాట్లాడుతూ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేరు ప్రస్తావించగానే కాంగ్రెస్ కార్యకర్తలు చప్పట్లు కొడితే ఆమె వారించారు. పార్టీ కార్యక్రమాలు వేరు.. ప్రభుత్వం కార్యక్రమాలు వేరని సంయమనం పాటించాలని సూచించారు. దౌల్తాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల నమూనా భూమి పూజ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటోను అధికారులు విస్మరించారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. విషయం మంత్రి కొండా సురేఖ దృష్టికి వెళ్లడంతో ఆమె అధికారులను మందలించారు. భూంపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనడంపై వివాదం నెలకొన్నది. ఏ పదవిలేని చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని లోనికి పంపించి తమను అడ్డుకోవడంపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ వారిని సముదాయించారు. మిరుదొడ్డిలో జరిగిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్‌ల పంపిణీ కార్యక్రమంలోనూ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదికపైకి వెళ్తుండగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇరు పక్షాలను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సముదాయించారు. దుబ్బాకలో చిల్డ్రన్ పార్క్ ప్రారంభోత్సవానికి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రాగానే వారి చుట్టూ మహిళా కౌన్సిలర్‌లు చేరుకుని చెరుకు





వేర్వేరుగా కందుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- క్షేత్రస్థాయి పరిశీలనతో అర్హుల గుర్తింపు
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం
- రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

దుబ్బాక/మిరుదొడ్డి/దౌల్తాబాద్/తొగుట, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ మనుచౌదరి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మిరుదొడ్డిలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారన్నారు. రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, భూమిలేని నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసా సహాయం అందించేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. తాము ఎమ్మెల్యేకు గౌరవిస్తామని, రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు. ప్రొటోకాల్ వివాదంలో తాము ఒక అడుగు వెనక్కు తగ్గామని మంత్రి తెలిపారు. రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎలా ఉండేదో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఓపిక పట్టాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు.

- దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని మంత్రి కొండా సురేఖను దుబ్బాక డెవలప్‌ఫోరం నాయకులు కోరారు.
- ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న రామేశ్వరంపల్లి కూడవెళ్లి రామలింగేశ్వరాలయం జాతరకు హాజరుకావాలని ఆలయం కమిటీ మంత్రిని ఆహ్వానించారు.
- దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద నిర్మించిన బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి కొండా సురేఖ

మిగతా 8వ పేజీలో



దుబ్బాకలో చిల్డ్రన్‌పార్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు



జాబితాలో పేరు లేకపోవడంతో నంగునూరు ఎంపీడీవో కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్న ఆశావహులు

8 ఏళ్లవుతున్నా రేషన్‌కార్డు రాలేదు



మాకు పెళ్లి అయి 8 సంవత్సరాలు అవుతుంది. ఇంతవరకు రేషన్‌కార్డు రాలేదు. ప్రజాపాలనలో రేషన్‌కార్డు లేదని దరఖాస్తు చేసుకున్నాం. కులగణన సర్వేలో కూడా రేషన్‌కార్డు లేదని చెప్పాం. కానీ ఇటీవల వచ్చిన రేషన్‌కార్డు జాబితాలో మా పేరు లేదు. రేషన్‌కార్డు లేకపోవడంతో గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలు వర్తించలేదు. మళ్లీ ఇప్పుడు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చాం. గతంలో మేము చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయి? రేషన్‌కార్డు వస్తదో రాదో అని ఆందోళన నెలకొన్నది.

- గౌటే తారకేశ్వరి, చిన్నకోడూరు

రేషన్‌కార్డులపై గందరగోళం

- అర్హులైనా జాబితాలో లేని పేర్లు
- ప్రజాపాలనలో 70 వేలకు పైగానే దరఖాస్తులు
- క్షేత్రస్థాయిలో 18,213 వేల పరిశీలన
- సమగ్ర కుటుంబసర్వే వివరాలతోనే పంపిణీ
- ప్రజాపాలన అర్జీలు సంగతి అంతేనా?

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి పంపిణీ చేయనున్న కొత్త రేషన్ కార్డులు కొందరికే అందనున్నాయి. అర్హుల జాబితా విడుదల చేయగా అందులో పేరు లేకపోవడంతో అర్జీదారుల్లో ఆందోళన నెలకొన్నది. సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇటీవల నిర్వహించిన ఇంటింటి (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే ఆధారంగా రేషన్‌కార్డుల్లేని కుటుంబాలు జిల్లాలో 18,213 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ లెక్క మేరకే క్షేత్రస్థాయిలో 136 బృందాలు సర్వే జరుపుతున్నారు. అందులో అర్హులుగా గుర్తించిన వారికే కొత్త రేషన్ కార్డులివ్వనున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు జిల్లాలో 11 వేలకుపైగా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఈ నెల 21 నుంచి 24 మధ్య గ్రామ సభల్లో లబ్ధిదారుల వివరాల వెల్లడించి, నూతన రేషన్ కార్డులను రిపబ్లిక్ డే నాడు అందించనున్నారు.

ప్రజాపాలనలో 70 వేల దరఖాస్తులు

గతేడాది ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో రేషన్‌కార్డుల కోసం 70వేల మందికిపైగానే దరఖాస్తు చేసుకున్నారు. వీటి సంగతి ఏమిటి అంటూ అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు. జాబితాలో పేరు లేని వారు నుంచి మళ్లీ ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- 4,361 మంది విద్యార్థుల హాజరు
- 2,104 మంది గైర్హాజరు
- 67.42 హాజరు శాతం

7

బీజేపీ వైఖరితో రాజ్యాంగ ఉనికికే ప్రమాదం

- రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంతరావు
- చేర్యాలలో సంవిధాన్ బచావో ర్యాలీ

7

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రుల చెంతకు

సహకార సంఘాల పెంపునకు సన్నాహాలు

- మహాసముద్రం కొండల్లో ట్రెక్కింగ్, కేబుల్‌బ్రిడ్జి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ/హుస్నాబాద్‌రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకోసం జిల్లాల నుంచి అభిప్రాయాలను తీసుకుంటోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కోహెడలో శనివారం ఆయన కేడీసీసీ చైర్మన్ కొండూరు రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావుతో కలిసి ప్రాథమిక సహకార సంఘ నూతన భవనం, గోదాములను ప్రారంభించారు. అనంతరం హుస్నాబాద్ మండలం మహాసముద్రం కొండల ప్రాంతాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మాపూర్ గుట్టల్లోని మహాసముద్రం ప్రాంతం చుట్టూ ఎత్తైన కొండలు, మధ్యన చెరువుతో పర్యాటకులను ఆకట్టుకుంటుందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. మహాసముద్రం కొండల్లో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తామన్నారు. కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తామన్నారు. సర్వాయి పాపన్న గుట్టల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఆయన గుర్తు చేశారు.



మహాసముద్రం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి



పనులను పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

'జిల్లా జైలు నిర్మాణ పనుల పరిశీలన'

సిద్దిపేట అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా జైలు నిర్మాణ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామపరిధిలో నిర్మిస్తున్న జిల్లా జైలు నిర్మాణ పనులను శనివారం ఆమె సీపీ అనురాధ, ఇతర పోలీసుఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ దశలో ఉన్న పనులను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సదుపాయాలు నిర్దేశ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు.

పాలకవర్గంపై విరుచుకుపడిన కాంగ్రెస్

- కౌన్సిల్ హాల్‌కు రూ.40లక్షలు పెట్టడం అధికార దుర్వినియోగమే
- నిధుల దుర్వినియోగంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు వాస్తవాలేనని వెల్లడి

సదాశివపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) :సదాశివపేట బల్దియాలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని గత కొద్ది రోజులుగా ఆంధ్రజ్యోతిలో వస్తున్న కథనాలు వాస్తవాలేనని కాంగ్రెస్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రూ.40లక్షల నిధులతో సుందరీకరించిన కౌన్సిల్ మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం జరిగిన సందర్భంలో నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, నాగరాజుగౌడ్, గుండు రవి, ఆపార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో బల్దియా ఖజానా ఖాళీగా ఉందన్నారు. ఇలాంటి దయనీయ స్థితిలో అంతా బాగానే ఉన్న కౌన్సిల్ మీటింగ్ హాల్‌కు యుద్ధప్రాతిపదికన రూ.40 లక్షల ప్రజాధనంతో సుందరీకరించడం అధికార దుర్వినియోగమేనన్నారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మాటలన్నీ అబద్దాలే...

కౌన్సిల్ మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా చైర్‌పర్సన్ అపర్ణ పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్‌లు పట్టణ ప్రజలకు పూర్తి అబద్ధాలు చెప్పారని మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం ఆరోపించారు. 2022 మే నెలలో స్టడీటూర్ కోసం చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ హయాంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. బల్దియా ఆర్థిక పరిస్థితుల బాగోలేక స్టడీటూర్ వాయిదా వేశారన్నారు. కానీ ఇప్పటి పాలకవర్గం గత 2024 ఆగస్టులో రూ.15లక్షలు స్టడీటూర్ కోసం ఖర్చు చేసిందన్నారు. స్టడీ టూర్ వల్ల పాలకవర్గం కౌన్సిలర్లు చండీఘడ్ రాష్ట్రం వెళ్లి నేర్చుకుంది ఏమిలేదన్నారు. సదాశివపేట బల్దియాలో నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారులు విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

టేక్మాల్, జనవరి18(ఆంధ్రజ్యోతి) : పిల్లలు ప్రతీ రోజు మంచి పౌష్టికాహారం తీసుకుని, కొంత సేపు వ్యాయామం చేయాలని వైద్యాధికారులు శ్రీనివాస్, ఝాన్సీ సూచించారు. శనివారం మండలంలోని సూరంపల్లి , చెరువు ముందటితండా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రామ ఆరోగ్యశాఖ సిబ్బంది, రాష్ట్రీయ బాల స్వస్త (ఆరోగ్య) కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు పరిక్షించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క బరువు, ఎత్తు, చెస్ట్, హెడ్ కొలతలు చెక్ చేశారు. అనారోగ్య లోపాలు ఉన్న పిల్లలను మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రులకు పంపే ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య తదితరులు పాల్గొన్నారు.

పంట ఎదుగుదలకు జాగ్రత్తలు పాటించాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రవీణ్‌చారి

నాగల్‌గిద్ద, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పంటల ఎదుగుదలకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని నాగల్‌గిద్ద మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్‌చారి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉట్‌పల్లి గ్రామంలో జొన్న పంటను స్థానిక ఏఈవో సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు ఎదుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు.

బ్యాంకుల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి : డీఎస్పీ

తూప్రాన్, జనవరి 18: (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో రక్షణ చర్యలు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. బ్యాంకుల్లో ఇటీవల కాలంలో దొంగతనాలు, దోపీడీలు జరుగుతున్నాయని వివరించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైన అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో తూప్రాన్ ఎస్‌ఐ శివానందం, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రుల చెంతకు..

రెండు గంటల్లోనే అప్పగించిన సీఐ


తల్లితో చిన్నారి

గజ్వేల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో శుక్రవారం రాత్రి బాలిక అదృశ్యమైన బాలికను గజ్వేల్ సీఐ సైదా కీలకంగా వ్యవహరించి రెండు గంటల్లోనే తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఐఓసీ మైదానం వద్ద గుడిసెలో నివాసం ఉంటున్న మోతే మైసమ్మ-యాదగిరిల కుమార్తె మోతే పున్నమ్మ రాత్రి పది గంటల సమయంలో తప్పిపోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ సైదా తన సిబ్బంది వెంకటేశ్, నరేందర్, కృష్ణ, రాజు గ్రూపులుగా విడిపోయి ఐఓసీ మైదానం చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను వెతికారు. రాత్రి 12గంటలకు పాపను గుర్తించి తల్లిదండ్రులను పిలిపించి క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ సైదాను, పోలీస్ సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అభినందించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


శ్రీహరి(ఫైల్)

నర్సాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అప్పులతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ లింగం కథనం ప్రకారం ఎం.శ్రీహరి(35) స్వర్ణకార వృత్తి చేస్తున్నాడు. పనులు సరిగ్గా నడవక మద్యానికి బానిసయ్యాడు. పని మానేయడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు అయ్యాయి. అవి తీరే మార్గం కనిపించక శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. భార్య మధులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీహరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోతుల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

చిలప్‌చెడ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. సానికుల కథనం ప్రకారం ఫైజాబాద్ గ్రామానికి చెందిన వంజరి బుచ్చయ్య ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పశువుల పాకలోకి పాలు పితకడానికి వెళ్లాడు. ఆ సమయంలో కోతుల గుంపు ఒక్కసారిగా బుచ్చయ్యపై దాడి చేశాయి. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. ఆయన అరుపులు విన్న స్థానికులు వచ్చి కోతులను తరమడంతో ప్రమాదం తప్పింది. గాయపడిన బుచ్చయ్యను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతంలోనూ గ్రామంలో కోతులు దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయని, ఒంటరిగా బయటికి వచ్చే పరిస్థితులు లేవని గ్రామస్థులు చెప్పారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టిన కారు

ఒకరు మృతి.. మరొకరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులో మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం జరిగింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. కోదాడకు చెందిన సయ్యద్ మేరాజ్ అలీ (45) ట్యాక్సీ కారులో సిద్దిపేటలో బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. కారు కొండపాక శివారులోకి రాగానే సిద్దిపేట వైపు ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టడంతో కారులో ఇరుక్కు పోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ రఫీక్‌కు గాయాలయ్యాయి. గాయాలైన ఆయనను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి


వెంకటస్వామి(ఫైల్)

తూప్రాన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గెస్ట్‌హౌస్ వద్ద పని చేస్తున్న ఓ వ్యక్తి కరెంట్ షాక్‌తో చనిపోయాడు. శనివారం తూప్రాన్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి కథనం ప్రకారం.. మండలంలోని ఇస్లాంపూర్‌కు చెందిన అడప వెంకటస్వామి (38) తూప్రాన్‌లోని వికాస్‌రెడ్డి గెస్ట్ హౌస్ వద్ద పని చేస్తున్నాడు. ఈ నెల 1న కరెంట్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ వైఖరితో రాజ్యాంగ ఉనికికే ప్రమాదం


సంవిధాన్ బచావో ర్యాలీలో మాట్లాడుతున్న వీహెచ్

చేర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపన కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఉనికికి బీజేపీ వైఖరితో ప్రమాదం పొంచి ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు పేర్కొన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేర్యాల లోని గాంధీచౌక్ నుంచి అంగడిబజారు చౌరస్తా వరకు సంవిధాన్ బచావో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వి.హనుమంతరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాలరాసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని దేశప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. అమిత్ షా వైఖరిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు కృష్ణ, కొమ్ము రవి, పుర్మ ఆగంరెడ్డి, దాసరి కళావతి, ఆడెపు నరేందర్, దాసరి శ్రీకాంత్, ముస్త్యాల యాదగిరి, బందిగ రాకేశ్‌కృష్ణన్, ఆది శ్రీనివాస్, మల్లిగారి నర్సింహులు, మామిడాల నాగరాజు, వంగ జయ, రేకులపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌ను కలిసిన నాయకులు

కొండపాక, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాలకు వెళ్తున్న వీహెచ్‌కు మండలంలోని తిమ్మారెడ్డి పల్లి వద్ద సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు శనివారం స్వాగతం పలికారు. హనుమంతరావు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులతో కొద్దిసేపు మాట్లాడారు. టీపీసీసీ కార్యదర్శి గంప మహేందర్ రావు. పీసీసీ సెక్రెటరీ లక్ష్మణ్ యాదవ్, ముద్దం లక్ష్మి, వహీద్ ఖాన్, బొమ్మల యాదగిరి, షాబు, అక్బర్, ప్రవీణ్, రజిని, సన, ప్రసాద్ తదితరులు హనుమంతరావు కలిసిన వారిలో ఉన్నారు.

సింగపూర్‌లో సీఎం రేవంత్‌ను కలిసిన సునీత



జగదేవ్‌పూర్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ కల్చరల్ సొసైటీ(సింగపూర్) వైస్ ప్రెసిడెంట్ మొగిలి సునితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం సింగపూర్‌లోని గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి విచ్చేసిన రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ కల్చరల్ సొసైటీ చేపడుతున్న పలు కార్యక్రమాల వివరాలను ఆమె సీఎంకు వివరించారు. కార్యక్రమంలో కల్చరల్ సొసైటీ అధ్యక్షులు గడప రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మూట, ముల్లెతో మల్లన్న చెంతకు..

నేడే పట్నంవారం..

- ప్రారంభం కానున్న జానపదుల మహాజాతర
- భక్తజనంతో ఆలయపరిసరాల కిటకిట
- వసతిగదులు దొరక్క భక్తుల ఇబ్బందులు
- కానరాని ఉచిత వాహన సౌకర్యం
- ప్రైవేటు గదుల అద్దె దోపిడీ

510 మందితో పోలీసుల పటిష్ట బందోబస్తు


శనివారం రాత్రి ఆలయం వద్ద భక్తుల రద్దీ



భక్తుల దర్శనం కోసం సిద్ధం చేసిన తాత్కాలిక క్యూలైన్లు

చేర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జానపదుల జనజాతరకు ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం సిద్ధమైంది. జాతరలో మొదటి ఆదివారం (పట్నంవారం) మల్లన్న దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన భక్తులు శనివారం సాయంత్రానికి మూటముల్లెతో కొమురవెల్లికి చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు క్రిక్కిరిసిపోయాయి. భక్తులు కాళ్లు, చేతులు శుభ్రపరచుకోకుండానే నేరుగా స్వామివారిని ధూళిదర్శనం చేసుకుని ఒడిబియ్యాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మల్లన్నకు బోనాలు, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మల్లన్న ఆలయగుట్టపై ఉన్న ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించనున్నారు. సోమవారం తోటబావి ప్రాంగణంలో హైదరాబాద్ యాదవసంఘం ఆధ్వర్యంలో పెద్ద పట్నం, అగ్నిగుండాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం స్నానాల కోసం తోటబావి, కోడెల స్తంభం, మల్లన్న చెరువు సమీపంలో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ సిద్ధం చేశారు. ధర్మ, ప్రత్యేక, వీఐపీల క్యూలైన్ ఏర్పాటుచేశారు.

చుక్కలనంటిన ప్రైవేటు గదుల అద్దె

ఆలయ పరిధిలోని గదులను దాతలకు కేటాయించగా, భక్తుల రద్దీ కారణంగా ప్రైవేటు గదుల యాజమానులు మూడు రోజులకు రూ.4-8వేల చొప్పున అద్దె అడ్డగోలుగా వసూలుచేశారు. చిన్నపాటి ఖాళీస్థలంలో తడకలు అడ్డుపెట్టి రూ.2వేలు చొప్పున అద్దెకు ఇచ్చారు. ఆర్థికస్థోమత లేనివారు ఆరుబయట ప్రదేశాలలో గుడారాలు వేసుకోగా, మరికొంత మంది చెట్టునీడన తలదాచుకున్నారు.

కానరాని ఉచిత వాహన సౌకర్యం

కొమురవెల్లి శివారులోనే వాహనాలను ఆపిన నేపథ్యంలో పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులను ఆలయం వరకు తీసుకువచ్చేందుకు ఉచిత వాహన సౌకర్యం ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. కానీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు, ముల్లె, మూటనెత్తినపెట్టుకుని వంట సామగ్రి చేతపట్టుకుని నడుచుకుంటూ వచ్చి తంటాలుపడ్డారు.

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి

సిద్దిపేట సీపీ అనూరాధ

పట్నంవారాన్ని పురస్కరించుకుని మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సిద్దిపేట సీపీ అనూరాధ సూచించారు. శనివారం ఆమె మల్లన్న ఆలయాన్ని సందర్శించి క్యూలైన్లు, పార్కింగ్ తదితర ప్రదేశాలు పరిశీలించారు. అనంతరం బందోబస్తు విధుల నిర్వహణ పట్ల పోలీసు సిబ్బందితో సమావేశమై దిశానిర్దేశం చేశారు. 510మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేపట్టామని తెలిపారు.

కొమురవెల్లికి వస్తున్న భక్తులు


ఫ్లెక్సీలపై బీఆర్ఎస్, సీపీఎం ఆగ్రహం

ఆలయ రాజగోపుర ఆవరణతోపాటు జనం ఎక్కువగా ఉండే ప్రధాన ప్రదేశాలలో కటౌట్లు ఏర్పాటు ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్‌చేశారు.

మాయమవుతున్న కోమటికుంట

- వ్యర్థాలతో నింపి.. విక్రయాలు
- నాడు 19 ఎకరాలు.. నేడు మూడే..


కోమటికుంటలో ఆక్రమణలు

ఐడీఏబొల్లారం జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదాన్ని పంచాల్సిన చెరువు మాయం అవుతున్నాయి. సంరక్షించాల్సిన అధికారులు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకున్న కబ్జాదారులు కుంటలను ఆక్రమించి, దర్జాగా అమ్ముకుంటున్నారు. ఇంటి నంబర్లు ఇచ్చి అధికారిక ముద్ర వేస్తున్నారు. ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 19 ఎకరాల్లో కోమటికుంట విస్తరించి ఉంది. కుంట చుట్టూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వారు నివాసం ఉంటున్నారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న కాంక్ష ఉన్న వారి ఆశలను ఆక్రమణదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల స్థోమతను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. 60 గజాల స్థలాన్ని రూ. 6 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు అమ్ముతున్నారు. స్థలం కావాలనుకునే వారు స్థానిక నాయకులను సంప్రదిస్తే బినామీల పేర్లు చెప్పి వారి వద్దకు పంపుతారు. నేరుగా నాయకులు డబ్బులు ముట్టుకోరు. మాకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తారు. రోజువారీగా అమ్మకాలు జరపడానికి వీలుగా పరిశ్రమల వ్యర్థాలతో పాటు స్థానికంగా విడుదల నిర్మాణ వ్యర్థాలు కుంటలో పోసి నాటకీయంగా ఆక్రమణకు పాల్పడుతున్నారు.

15 ఎకరాల పైచిలుకు ఆక్రమణ

19 ఎకరాల కోమటికుంట ఆక్రమణల్లో చిక్కి ప్రస్తుతం మూడు ఎకరాలు మాత్రమే మిగిలింది. ఎవరికీ అనుమానం రాకుండా కొనుగోలుదారులు వచ్చినప్పుడు వ్యర్థాలను నింపుతూ 60 గజాల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

కేసులు పెడతాం

కోమటికుంట ఆక్రమణ విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయి. ఆక్రమణ చేస్తున్న వారి వివరాలు బయటకు రావడం లేదు. ఆరా తీస్తున్నాం. తప్పకుండా క్రిమినల్ కేసులు పెడతాం. - ప్రసాద్ నీటిపారుదలశాఖ ఏఈ

అక్రమంగా నిర్మిస్తే తొలగిస్తాం

కుంటలో నిర్మాణాలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ఎటువంటి అనుమతులు మంజూరు చేయడం లేదు. పాత కాలం నాటి ఇంటి నంబర్లు గదులపై వేస్తున్నారు. వాటి విషయంలో విచారణ జరిపిస్తాం.

- పవన్, మున్సిపల్ పట్టణ విభాగం అధికారి


జహీరాబాద్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

4,361 మంది హాజరు


ఖేడ్‌లోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వర్గల్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్

వర్గల్/సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/రామాయంపేట, జనవరి 18: వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి గాను శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని 30 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఆరో తరగతిలో మొత్తం 80 సీట్లకు గాను 6,465 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, శనివారం నాటి ప్రవేశపరీక్షకు 4,361 మంది విద్యార్థులు హాజరయ్యారు. 2,104 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరిగింది. మెదక్ జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో 1,589 మంది విద్యార్థులకు గాను 1083 మంది విద్యార్థులు హాజరైనారు. సంగారెడ్డి జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలలో 2,626 మంది విద్యార్థులకు గాను 1613 మంది హాజరయ్యారు. సిద్దిపేట జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలలో 2,250 మంది విద్యార్థులకు గాను 1665 మంది హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థుల శాతం 67.42 కాగా గైర్హాజరైన విద్యార్థుల శాతం 32.58 అని తెలిపారు.

కొలువుల కోట 'కొడకండ్ల'

ఆ గ్రామంలో 85 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు

- 1960లో ఐదుగురితో మొదలైన ప్రస్థానం
- గ్రామానికి ప్రత్యేక టీచర్ల సంఘం
- ఇతర రంగాల్లో మరో వంద మంది

Sunday Special



గజ్వేల్ మండలంలోని కొడకండ్ల రైల్వేస్టేషన్

గజ్వేల్/గజ్వేల్ రూరల్, జనవరి 18, (ఆంధ్రజ్యోతి): ఒక గ్రామంలో ఒకటి నుంచి పది లేదా 20 మంది ఉద్యోగులు ఉంటారు. ఆ గ్రామంలో ఏకంగా 85 మంది ఉద్యోగులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాదాడి రంగారెడ్డి స్ఫూర్తితో మొదలైన ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతుంది. ఆ గ్రామమే గజ్వేల్ మండలం కొడకండ్ల. 1960లో నలుగురు ఉద్యోగులతో మొదలైన ఈ గ్రామంలో ప్రస్తుతం 85 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఇందులోనూ అత్యధికంగా టీచర్లు ఉండడం ఈ గ్రామం ప్రత్యేకత. సీనియర్ గురువులను ఆదర్శంగా తీసుకుని నేటి యువత పట్టుబట్టి చదువుతుండడం.. వారికి సీనియర్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకారం అందిస్తుడడంతో గ్రామంలో కొలువుల కోటగా మారింది. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన మాదాడి రంగారెడ్డి అగ్గిపెట్టేపైన పేరు రాసిస్తే కలెక్టర్, ఉన్నతాధికారులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేవారని ఇప్పటికీ వృద్ధులు చెబుతుంటారు. అలాంటి వ్యక్తి జన్మించిన కొడకండ్లలో ప్రస్తుతం యువకులు పోటీపడి మరీ చదివి ఉద్యోగాలు సాధిస్తుండడం నిజంగా గొప్ప విషయమనే చెప్పవచ్చు.

ఇంటికో గ్రాడ్యుయేట్..

గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో మొత్తం 3100 జనాభా ఉండగా, సుమారు 400 మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఇంటికో గ్రాడ్యుయేట్ ఉండడంతోపాటు ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌లో దాదాపు 50మంది చదువుకున్నారు. ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడినా గ్రామం నుంచి ఒక్కరైనా ఉద్యోగం సాధించడం ఈ గ్రామం ప్రత్యేకత. రాష్ట్రంలోనే ఓ గ్రామంలో ప్రత్యేక టీచర్ల సంఘం ఉందంటే అది కొడకండ్లనే అని చెప్పవచ్చు. కొడకండ్ల టీచర్స్ అసోసియేషన్ (కేటీఏ) పేరిట ప్రత్యేక టీచర్ల సంఘం ఏర్పాటు చేసి, ఆయా సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామంలో మొత్తం మంది 25 ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక ఆర్మీ, నేవీ, పోలీస్, వైద్యులు, అటవీ శాఖ అధికారులు, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్ సంస్థ, పంచాయతీ కార్యదర్శులుగా ఇలా అనేక రంగాల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రైవేటు రంగంలోనూ ఈ గ్రామంలో దాదాపుగా వంద మంది వరకు ఉద్యోగాలు చేస్తున్నారు. విద్యుత్ శాఖలో, వైద్య శాఖలో ఇతరత్రా ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు.

సోదరుల సహకారంతో..



చిన్నతనం నుంచి ఉపాధ్యాయులను చూస్తూ పెరగడం... వారి బోధనతో ఇంటర్‌లోకి వచ్చేసరికి ఉపాధ్యాయ వృత్తిలో చేరాలన్న ఆకాంక్ష బలపడింది. అదే సమయంలో నాన్న చనిపోవడంతో సోదరుల సహకారంతో బీఈడీ పూర్తి చేశాను. 2008లో డీఎస్సీలో ఎంపిక కావడంతో ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరా. కొడకండ్ల టీచర్స్ అసోసియేషన్ స్థాపించి మొన్నటి కరోనా విపత్కర పరిస్థితిలో వలస కూలీలకు, పేదలకు నిత్యావసర వస్తువులను అందించడంతో పాటు అనేక కార్యక్రమాలను చేపట్టాం.

దీకొండ శ్రీశైలం, ఉపాధ్యాయుడు

తల్లిదండ్రుల సహకారంతోనే..



అమ్మానాన్న అక్కరాజు మల్లయ్య-భాగ్యమ్మలు నేను రెండో సంతానం. కష్టపడి చదివించారు. ఉద్యోగం సాధిస్తేనే తల్లిదండ్రుల కష్టాలు తీరుతాయని బలంగా నమ్మి.. అందుకు అనుగుణంగా కష్టపడి చదివాను. 2005లో సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగం సాధించా.

- అక్కరాజు నర్సింలు, సీఆర్‌పీఎఫ్

గ్రంథాలయం కావాలి



గ్రామంలో పూర్తిస్థాయి అధునాతన హంగులతో గ్రంథాలయాన్ని నిర్మించాలి. కోచింగ్ సెంటర్లకు వెళ్లి హాస్టళ్లలో ఉంటూ ఆర్థికంగా భరించలేని అనేక మంది యువతీ, యువకులు పోటీపరీక్షలకు దూరంగా ఉంటున్నారు. యువత పోటీ పరీక్షలకు చదువుకునేందుకు వీలుగా అన్ని రకాల పుస్తకాలను, కంప్యూటర్లతో కూడిన డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తే యువతీ, యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

- చేర్యాల రామచంద్రం, ఉపాధ్యాయుడు

మొదటి పోలీస్ జాబ్ నాదే..



మా ఊర్లో నేనే మొదటి పోలీస్ ఉద్యోగం సాధించా. అప్పటికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నా పోలీస్ ఉద్యోగం ఎవరికీ రాలేదు. ఏలాగైనా జాబ్ కొట్టాలన్న సంకల్పంతో 1990లో పోలీస్ జాబ్ కొట్టాను. మా అమ్మమ్మ-తాత కోరిక మేరకు పోలీస్ ఉద్యోగాన్ని సాధించా. మా అమ్మ 1985లో చనిపోవడం, నా ముగ్గురు తమ్ముళ్లు, సోదరి బాధ్యత నాపైనే పడింది. అప్పటి మా గ్రామ సర్పంచ్ భూపతిరెడ్డి ప్రోత్సహించాలి.

- పంపరి నర్సింలు, హెడ్ కానిస్టేబుల్

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

మర్కుక్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మన్నే వెంకటయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ పాండుగౌడ్ కేసీఆర్, హరీశ్‌రావుల సహకారంతో బాధితుడికి నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించారు. ఈ మేరకు రూ.2.25లక్షల ఎల్‌వోసీని శనివారం మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్యలతో కలిసి బాధితుడి కుటుంబానికి అందజేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాయపోల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తుగారి ముత్యంరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

చేర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

కాలువల నిండా 'చెత్త'





సిద్దిపేటలోని శ్రీనివాసనగర్ మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త, కోమటి చెరువు నుంచి నర్సాపూర్‌కు వెళ్లే వరద కాలువ చెత్తతో నిండిన దృశ్యం

సిద్దిపేట పట్టణంలోని వరదకాలువల్లో చెత్తను ఇష్టానుసారంగా వేయడంతో అవి కాలుష్యకాసారంగా మారుతున్నాయి. ఇక మురుగుకాలువల పరిస్థితి మరింత దుర్భరం. మురుగు, వరద కాలువల్లో చెత్తను పేరుకుపోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. నాలాల వద్ద తీవ్ర పారిశుధ్యలోపం నెలకొని స్థానికులు మురుగు కంపుతో సతమతమవుతున్నారు. దీంతో ఈగల మోత, దోమలబెడద పెరిగింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని బహిరంగంగా చెత్త వేయకుండా చూడాలని పలువురు కోరుతు న్నారు. అదేవిధంగా కాలువల్లో వేసిన చెత్తను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటో గ్రాఫర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి)



విక్టరీ చౌరస్తా వద మురుగు కాలువలో చెత్త వేస్తున్న ఓ చిరువ్యాపారి

పేదల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్

● పలు మండలాల్లో ఘనంగా వర్ధంతి



చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



హుస్నాబాద్‌లో ఎన్టీఆర్ చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



దౌల్తాబాద్‌లో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చేర్యాల/ గజ్వేల్/ హుస్నాబాద్ టౌన్/ దౌల్తాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లాలోని పలు మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. చేర్యాలలో టీడీపీఆధ్వర్యంలో తెలుగు యువత అధికార ప్రతినిధి ఒగ్గు రాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, ఎన్టీఆర్ అభిమాని నాయిని యాదగిరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. హుస్నాబాద్ పట్టణంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు పులిగారి రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేయాలి



మద్దూరు: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

మద్దూరు/ చేర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగుర వేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలో మండలపార్టీ అధ్యక్షుడు మేక సంతోష్, మంద యాదగిరి అధ్యక్షతన మద్దూరు, దూళిమిట్ట మండలాల కార్యకర్తలతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు, దూళిమిట్ట మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.ఆలయాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదు

● ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి

చిన్నకోడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వభూమిని తమ కుటుంబం కబ్జా చేసిందని సోషల్‌మీడియాలో వస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్, మేడిపల్లి మాజీ సర్పంచ్ ముక్కిస సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మేడిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమతపు బదిలీలో భాగంగా 1962లో మా గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు ప్రభుత్వానికి భూమి ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగానే 1962లో తన తండ్రి 10.03 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చాడని, దీనికి బదులుగా ప్రభుత్వం 1963లో 7.39 ఎకరాల భూమిని ఇచ్చిందన్నారు. ప్రభుత్వం నుంచి మాకు ఇంకా 2.04 ఎకరాల భూమి రావాల్సి ఉందన్నారు. అసలు విషయం తెలుసుకోకుండా కొందరు గిట్టని వారు తమపై అవాస్తవ ఆరోపణలు చేసి తమ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని ఆరోపించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాపిరెడ్డి, భూపాల్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలి



సిద్దిపేటలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిద్దిపేట క్రైం/గజ్వేల్/దూళిమిట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ప్రజలు, వాహనదారులకు శనివారం పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సిద్దిపేట ఓల్డ్ బస్టాండు సమీపంలో నెహ్రూ యువ కేంద్రం విద్యార్థుల ఆధ్వర్యంలో ఓల్డ్ బస్టాండ్ నుంచి విక్టరీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మెదక్ రోడ్‌లో ఉన్న కార్ల అడ్డావద్ద కారు డ్రైవర్లకు, యజమానులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట కారు అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్బు రమేష్, వైస్ ప్రెసిడెంట్ బైరి నరేష్, ట్రాఫిక్ ఏఎ్సఐలు ఉమేష్, సదాశివరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో ఎంవీఐ క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పువ్వు ఇచ్చి సీట్ బెల్టు ధరించాలని, హెల్మెట్ ధరించాలని కోరారు. గజ్వేల్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఏఎస్‌ఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనల గూర్చి వివరించారు. కాగా షీటీమ్ బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏఎస్‌ఐ అవగాహన కల్పించారు. దూళిమిట్ట మండలంలోని కొండాపూర్‌లో పోలీసులు ప్రజలకు రోడ్డుభద్రత, వాహనదారులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు.

కొండపోచమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు: ఆర్డీవో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ

జగదేవ్‌పూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి జరిగే కొండపోచమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ సూచించారు. జాతర ఏర్పాట్లపై గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు భక్తులు భారీగా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్ సమస్య తలెత్తకుండా గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది తగు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాతర జరిగే సోమ, మంగళవారాల్లో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు కొమురవెల్లికి వచ్చిన బస్సులను కొండపోచమ్మ ఆలయం వరకు నడిపించాలని సూచించారు. జాతర జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరను సజావుగా సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కొండపోచమ్మ ఈవో రవికుమార్, డీఎల్పీవో లత, ఎంపీడీవో యాదగిరి, ఎలక్ట్రిసిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్, ఎస్‌ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రొటోకాల్ రభస

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాస్‌రెడ్డిని ముందుకు రాకుండా అడ్డుకున్నారు. తన కాన్వాయ్‌కు రూట్‌మ్యాప్ పోలీస్ సెక్యూరిటీ వాహనం వెంట రాలేదని, దారి చూపేందుకు ముందు వెళ్తున్న పార్టీ కార్యకర్త పడాల నరేష్‌పై చేయిచేసుకున్నారని కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. తమను పోలీసులు, అధికారులు అవమానించినా భరించి, సహకరిస్తే ఇలా ప్రవర్తించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకే కేంద్రం.. రెండుసార్లు ప్రారంభం

జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం చేపట్టిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య ప్రొటోకాల్ రభస కొనసాగుతూనే ఉన్నది. శనివారం చేర్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలోనూ మరోసారి బహిర్గతమైంది. చేర్యాల ప్రాంతంలో రైతులు పండించిన కందుల పంట చేతికందింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోరుతో కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఇప్పటికే ఆలస్యమవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించేందుకు అధికారులు నిర్ణయించారు. శనివారం నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తెలిపారు. అధికారుల సమాచారంతో ఆయన 10.30 గంటలకు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం కోసం సమయం కేటాయించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఉదయం 9.30 గంటలకు పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వెళ్లిపోయారు. కాసేపటి తరువాత వచ్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై ముందస్తుగా ప్రారంభంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రొటోకాల్ పాటించకపోవడంపై మండిపడ్డారు. అనంతరం తమ పార్టీ డైరెక్టర్లు, పీఏసీఎస్ అధికారులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని మరోసారి ప్రారంభించారు. ఒకే కొనుగోలు కేంద్రాన్ని రెండుసార్లు వేర్వేరుగా ప్రారంభించడం స్థానికంగా మరోమారు చర్చనీయాంశంగా మారింది.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి భూమి పూజ చేశారు. మంత్రి కార్యక్రమాలను ముగించుకుని వెళ్తున్న క్రమంలో ఆకస్మికంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి చిన్నారులకు సమయం ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్ గిరిజను, టీచర్‌ను ఆదేశించారు.

● తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి దుబ్బాక 12వ ప్యాకేజీ కెనాల్ ప్రధాన కాలువకు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం గంగమ్మకు హారతి ఇచ్చి పూలు పండ్లు సమర్పించారు.

అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పని చేస్తుంది

సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు/నంగునూరు జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, ఇచ్చిన హామీలను నెరవేర్చుకునే బాధ్యత పార్టీపై ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట అర్బన్ మండలానికి రూ.1.10 కోట్ల నిధులను మంజూరు చేసుకున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.40 లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.8లక్షలు, టాయిలెట్‌లకు రూ.2 లక్షల చొప్పున మంజూరు చేసుకున్నామని పేర్కొన్నారు. అనంతరం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువలోకి మంత్రి నీటిని విడుదల చేశారు. అనంతరం జలహారతి ఇచ్చి పూజలు చేశారు. అదేవిధంగా నంగునూరు మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కొండాసురేఖ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం శనివారం రాత్రి శంకుస్థాపన చేశారు. అలాగే నంగునూరులో ఇందిరమ్మ ఇంటి నమూనా భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే లోకల్ బాడీ ఎన్నికలు ఉన్నందున కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపిస్తే అభివృద్ధికి అడ్డు ఉండదని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్ రావు, టీపీసీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పెట శంకర్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సాదుల పవన్ కుమార్, చేలికాని యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స్విచ్ఛాన్ చేసి దుబ్బాక కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరులు

డంపింగ్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గజ్వేల్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని డంపింగ్ యార్డులో శనివారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ సమాచారమందుకున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆధ్వర్యంలో డోజర్‌తో మున్సిపల్ సిబ్బంది మంటలు ఆర్పారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్‌యార్డులో పెద్ద ప్రమాదం జరగలేదని, వాటర్‌ట్యాంకర్లు, ఫైరింజన్ సహాయంతో తగిన చర్యలు చేపట్టామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం..కేసు నమోదు

గజ్వేల్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బ్రాహ్మణ బంజేరుపల్లిలో శనివారం ఓ వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరసయ్య(54)కు కుటుంబ సభ్యులతో చిన్న గొడవలు ఉండేవి. ఈ నెల 15వ తేదీన ఉదయం నుంచి అతడు అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



సమావేశంలో బ్యాంకు అధికారులకు సూచనలు చేస్తున్న ఏసీపీ

గజ్వేల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శనివారం బ్యాంకర్లతో అంతర్గత భద్రత, ఏటీఎంలలో భద్రత, సీసీ కెమెరాల పనితీరుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. బ్యాంకులో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి బ్యాంకు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్-100కు డయల్ చేయాలని పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సైదా, సీఐ లతీఫ్, ఎస్ఐలు రవికాంతారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అసిస్టెంట్ కమిషనర్

ధూళిమిట్ట,జనవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం జరుగుతున్న సర్వేను మండల స్పెషల్ అధికారి, జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలనీ తప్పులకు ఆస్కారం ఇవ్వవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్, మండల గిర్దావర్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, ఏఈవోలు అనూష, కల్పన తదితరులు పాల్గొన్నారు.

మామిడ్యాలలో ఉచిత పశు వైద్య శిబిరం

ములుగు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని చేర్యాల పశు వైద్యాధికారి ఏడీ రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మామిడ్యాల గ్రామంలో పశువైద్యాధికారి పల్లవి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు ఎలాంటి రోగాలు వచ్చినా వెంటనే పశు వైద్య అధికారులను సంప్రదించాలన్నారు. గోపాలమిత్రుల సేవలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నరోత్తం, వినయ్, గోపాలమిత్రులు, పాడిరైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ ఇవ్వాలి: టీపీటీఎఫ్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస రెడ్డి, నాయకులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక కుల గణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా పరిపాలన అధికారి రెహమాన్‌కు వినతి పత్రం అందజేశారు. సెలవు రోజుల్లో చేసిన సర్వేకు గానూ సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్‌క్లాసుల సమయంలో ఉదయం పూట అల్పాహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా టీపీటీఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. నరేందర్, రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉదారతను చాటుకున్న ఉపాధ్యాయుడు



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఉపాధ్యాయుడు

కొండపాక, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు నడిచివస్తున్న విద్యార్థినికి సైకిల్‌ను ఉచితంగా అందజేసి ఉదారతను చాటుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బందారం ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న వేమిరెడ్డి మహిత నిత్యం 4 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు నడిచివస్తున్నది. అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వంగ నర్సిరెడ్డి ఆమె ఇబ్బందులను గమనించి చలించిపోయాడు. ఈ మేరకు శనివారం ఆ విద్యార్థినికి సైకిల్‌ను బహూకరించాడని ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం వివరించారు.

నలుగురు క్రీడాకారులకు రిఫ్రెషర్ కోర్సు సర్టిఫికెట్లు

గజ్వేల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్నికల్ రిఫ్రెషర్ కోర్సు 16వ, 17వ తేదీల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో నిర్వహించారు. ఈ కోర్సుకు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ నుంచి గద్దెల రమేష్, సీహెచ్ మహేష్, కె సంపత్, ఆర్ రమ్యలను ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు జగదీశ్వర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్‌రెడ్డిలు వారికి రిఫ్రెషర్ కోర్సు సర్టిఫికెట్లను అందించారు. రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు సర్టిఫికెట్లు పొందిన వారిని రెఫరీలుగా ఎంపిక చేశారు. ఈ టెక్నికల్ కోర్సు పూర్తి చేసిన వారిని సిద్దిపేట జిల్లా కమిటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి. సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కుంట్ల శివకుమార్ అభినందించారు.